ప్రజాశక్తి
సోమవారం 26 ఆగస్టు 2024
5
శ్రీ సత్యసాయి





సమావేశంలో పాల్గొన్న జెవివి నాయకులు

ఆగని పొలిటికల్ హీట్

- వివాదాలకు కేంద్ర బిందువుగా తాడిపత్రి
- ఇద్దరు నేతల మధ్య సాగుతున్న యుద్ధం
- భయాందోళనలో పట్టణ ప్రజలు
- 29న వైసిపి నేతల ఇళ్ల వద్ద ధర్నాకు టిడిపి పిలుపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తాడిపత్రి అంటేనే ఆధిపత్యపు పోరుకు పరాకాష్టంగా మారింది. అటు వైసిపి అధికారంలోనున్న ఇటు టిడిపి అధికారంలో ఉన్నా ఎప్పుడూ ఉద్రిక్తతల నడుమే రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. గత ప్రభుత్వ హయంలోనూ అదే జరిగింది. ఇప్పుడు అదే జరుగుతోంది. గత ప్రభుత్వ హయంలో అధికార వైసిపి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పూర్తి స్థాయి ఆధిపత్యం చెలాయించే ప్రయత్నం చేశారు. నేరుగా జెసి. ప్రభాకర్‌రెడ్డి ఇంటిలోకెళ్లి కుర్చీలో కూర్చొని వచ్చారు. ఆ సమయంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఆ తరువాత మున్సిపల్ ఎన్నికల సమయంలో రెండు పార్టీల మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే నడిచింది. అయితే ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా తాడిపత్రి పురపాలక సంఘంలో అత్యధిక స్థానాల్లో టిడిపి గెలుపొందింది. ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ అయ్యారు. ఆ ఐదేళ్లు ఇద్దరు నేతల మధ్య తరచూ వివాదాలు నడుస్తూనే వచ్చాయి. ఇక ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఘర్షణలే చోటు చేసుకున్నాయి. ఎన్నికల రోజు అనేక చోట్ల నేరుగా రెండు గ్రూపుల మధ్య పరస్పరం దాడులు సైతం జరిగాయి. ఎన్నికల అనంతరం కూడా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీన్ని అరికట్టలేకపోయారని ఏకంగా ఎస్పీనే ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆయనతోపాటు డిఎస్పీ, సిఐలపైనా వేటు పడింది. ఇప్పటికీ వారు పోస్టింగుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక ఎన్నికల అనంతరం టిడిపి అధికారంలోకి రావడంతో జెసి.ప్రభాకర్‌రెడ్డి పూర్తి స్థాయి ఆధిపత్యానికి ప్రయత్నిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో అడుగుపెట్టనివ్వకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆయన మొదటిసారి పోలీసు స్టేషన్‌లో బెయిల్ కోసం వెళ్లిన సమయంలోనూ పోలీసు పహారా నడుమ వెళ్లివచ్చారు. గత వారంలో మరోమారు అడుగుపెట్టే ప్రయత్నం చేస్తే ఏకంగా ఇంటిపై దాడి చేయడడంతోపాటు , మరో నాయకుడి ఇల్లు , వాహనాలు ధ్వంసం చేశారు. ఈ దాడిని వైసిపి నాయకులు ఖండించారు. ఈ మేరకు స్పందించిన నేతల ఇళ్ల వద్ద ఈనెల 29వ తేదిన ధర్నాచేయడానికి తాడిపత్రి టిడిపి మహిళా నాయకులు ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఈ ధర్నాకు దిగితే మరోమారు వారి మధ్య ఏరకమైన పరిణామాలు చోటు చేసుకుంటాయన్నది సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. వైసిపి నాయకులు దీనికి ఏ రకంగా ప్రతిస్పందిస్తారో చూడాల్సి ఉంది. తాడిపత్రి నియోజకవర్గ రాజకీయాల్లో పొలిటికల్ హీట్ ఎప్పుడూ ఉంటుంది. ఇద్దరు నేతల మధ్య సాగుతున్న పోరు ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో అన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. దీన్ని అరికట్టే విషయంలో పోలిసు శాఖ ఏమేరకు సఫలీకృతమవుతుందో చూడాల్సి ఉంది. గతంలో విఫలమై ఇబ్బందులు పడిన అధికారులూ ఉన్నారు. కొత్తగా వచ్చిన ఎస్పీ తాడిపత్రి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఏ రకమైన చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.

ప్రశ్నించే వారిపై దాడులు సమంజసం కాదు

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సమాజంలో జరుగుతున్న అసమానతలను ప్రశ్నించే రచయితలు, కళాకారులు, విద్యార్థులు, ప్రజాస్వామ్య వాదులపై రోజురోజుకు దాడులు తీవ్రతరం అవుతున్నాయని ఇది సమంజసం కాదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి రిటైర్డ్ ఉపాధ్యాయులు వాసుదేవ రెడ్డి ఫామ్ హౌస్ లో ఏర్పాటుచేసిన జన విజ్ఞాన వేదిక మొదటి వార్షిక మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఎన్ మహేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు పూర్తిగా వ్యాపారమై మయమై కార్పొరేట్ కబంధహస్తాల్లో బందీ అయిపోయాయని అన్నారు. దీంతో సమాజంలోని ఎక్కువమందికి ప్రతికూల పరిస్థితుల్ని కల్పించే స్థితికి నెట్టబడ్డాయన్నారు. సైన్స్ ఉద్యమంలో పనిచేసే వాళ్లు దీన్ని అర్థం చేసుకొని సైన్స్ ఫలాలు సామాన్య ప్రజలకు కూడా అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రస్తుతం అనేక పెడ ధోరణులు చోటుచేసుకున్నాయని, రాజ్యాంగాన్ని కట్టుబడి నడుచుకుంటామని ప్రమాణం చేసిన వాళ్లే దానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. విద్య వైద్యంతో పాటు అన్ని రంగాల్లో అశాస్త్రీయ భావనలు చొప్పి అభివృద్ధి చెందిన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అపహాస్యం చేస్తూ ఛాందస వాదానికి బలం చేకూరుస్తున్నారు. రచయితలు, కళాకారులు, విద్యార్థులు మీద ప్రజాస్వామ్య శక్తుల మీద, ప్రశ్నించే వారి మీద దాడులు తీవ్రమయ్యాయనిప్రశ్నించే తత్వాన్ని కాదు మాట్లాడే స్వాతంత్రాన్ని కూడా హరించే పరిస్థితి ఈరోజు దేశంలో ఉందని వ్యాఖ్యానించారు. ఇదంతా పాలకుల ప్రోద్బలం తోనే జరుగుతుందని ప్రజాస్వామ్య విలువలు అడుగంటు తున్నాయని అన్నారు. వీటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు పైన ఉందని గుర్తు చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఈటి రామ్మూర్తి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య వసతులు లేని పల్లెలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. నిరుద్యోగం, అల్పాదాయ ఉపాధి ఎక్కువ మందిని జీవన భద్రతకు దూరం చేస్తున్నాయని తెలియజేశారు. తదనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు సంవత్సరం యొక్క కార్యక్రమాల నివేదికను సభలో ప్రవేశపెట్టారు. సభలో సంతాప తీర్మానాన్ని నరసా రెడ్డి ప్రవేశ పెట్టి అసువులు బాసిన వారికి అంజలి ఘటించారు, నీటి సమస్యల పై వెంకట్రామిరెడ్డి,ప్రాంతీయ సమస్యల పై లక్ష్మి నారాయణ, పర్యావరణంపై గంగాధర్ నాయక్, మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం పై రాజశేఖర్ రెడ్డి, విద్యపై వాసు దేవ రెడ్డి, చేనేత కార్మికుల సమస్యలపై మహేష్, శాస్త్ర ప్రచారం పై నబీ, భవిష్యత్ కార్య క్రమాల పై హరి తీర్మానాలు చేశారు. అనంతరం ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణ, నారాయణస్వామి, రాజేంద్రప్రసాద్, లోకేష్, రమేష్, నరేంద్ర జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోనిబిట్ ఇంజనీరింగ్ కళాశాల 2010-14 బ్యాచ్‌కు చెందిన సివిల్ విద్యార్థులు ఆదివారం కళాశాలలో సమావేశమయ్యారు. దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబాలతో కలిసి కళాశాలకు వచ్చి వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఇంజనీర్లకు మార్గ దర్శకులుగా ఉన్న విశ్వేరయ్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పది సంవత్సరాల అనంతరం నాటి స్నేహితులందరు కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రమేష్ అందరిని అభినందించి, జ్ఞాపికలను అందించారు. అదే విధంగా వారందరిని కళాశాల ఛైర్మన్ చంద్రమోహన్ అభినందించారు. అనంతరం అధ్యాపకులకు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విశ్వేరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మంత్రి ఎస్.సవిత


విద్యార్థితో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - రొద్దం

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్రమంత్రి సవిత అన్నారు. ఈ మేకు ఆమె ఆదివారం మండలంలోని మహాత్మ జ్యోతి బాలుర గురుకుల పాఠశాల, కస్తూరిబా గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మంత్రి ఆయా పాఠశాలల్లోరికార్డులను, ఉపాధ్యాయులు హాజరుపట్టికను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగది, భోజనం, బియ్యం, కాయగూరలు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యావిధానాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. భవనాలకు రంగులు, సొంత పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకోవడం తప్ప జగన్ చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన భవనాలే ఉన్నాయని అన్నారు. రొద్దంలో ఎంజేబీ, కేజీబీవీ,బాలికల జూనియర్ కళాశాల భవనాలకు అప్పట్లో నిధులు మంజూరు చేస్తే జగన్ ప్రభుత్వ అసమర్థత వల్ల భవన నిర్మాణం నిలచిపోయిందన్నారు. సీఎం చంద్రబాబు నేతత్వంలోని తమ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధానిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఒక్క కాల్ చేస్తే సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంజేపీ రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపల్ కు, వైద్య సిబ్బందికి మంత్రి సవితమ్మ సూచించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాయకులు నరసింహులు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, రొద్దం మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, టైలర్ ఆంజనేయులు, చిన్నమంతూరు పవన్, పెద్దగువ్వల పల్లి పవన్, వీరాంజ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు నీటి సౌకర్యం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 12వ వార్డు మోడల్ కాలనీలోని మునిసిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్యను టిడిపి నాయకులు పరిష్కరించారు. పాఠశాలకు అవసరమైన మోటారు, ట్యాంకు, నీటి పైపులు, కొళాయిలతో పాటు ఒక మరుగు దొడ్డిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 5వ క్లస్టర్ ఇంచార్జి వెంకటేష్, యూనిట్ ఇన్‌ఛార్జి మురళి దేశాయి, నాయకులు రామాంజినేయులు, దస్తగిరి సాబ్, మహబూబ్ బాషా, నాగేష్, అయూబ్, గంగాధర, నారాయణ స్వామి, శీనప్ప, వెంకటేశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆకుల రఘురామయ్యకు కవితా పురస్కారం

నార్పల : మండల కేంద్రానికి చెందిన ఆకుల రఘురామయ్యకు తెలుగు వైభవం జాతీయ కవితా పురస్కారం వరించింది. చిత్తూరులోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో నిర్వహించిన తెలుగు వైభవం, జాతీయస్థాయి శతాధిక తెలుగు కవి సమ్మేళనంలో రఘురామయ్యకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల చిన్నికృష్ణ, తెలంగాణ శాసనమండలి సభ్యులు, సాహితీవేత్త, గాయకులు గోరేటి వెంకన్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ జి.సుబ్రమణ్యంశర్మ, తదితరులు రఘురామయ్యకు శాలువా, ప్రశంసాపత్రం, కవిత పురస్కారాన్ని అందజేశారు.

ఉమర్ ఫారూఖ్ ఖాన్ కు వేమన సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు, తెలుగు భాషాభిమాని, కవి, రచయిత కల్లూరు మొహమ్మద్ ఉమర్ ఫారూఖ్ ఖాన్ వేమన సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆదివారం కదిరి ప్రాంతంలోని కటారుపల్లి తిమ్మమ్మ మర్రిమాను వద్ద సత్య సాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా, రాయసం చిన్నారావు, బాబా ఫక్రుద్దీన్, శంకర నారాయణ రాజుల ఆధ్వర్యంలో వేమన సాహితీయాత్ర జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చదువులు బాబు, ప్రొఫెసర్ బాలసు బ్రహ్మణ్యం, ఏడీ రజిత హాజరైనారు. వీరి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఉమర్ ఫారూఖ్ ఖాన్ వేమన సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కవులు, వేమన సాహితీ వేదిక సభ్యులు పాల్గొన్నారు.



. ఉమర్ ఫారూఖ్ ఖాన్ ను సన్మానిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో లఖ్ - పతి దీదీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలో నిర్వహించిన జెల్గాన్ నుంచి కేంద్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తూ సత్కరిస్తున్న కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్లో వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో పాటు డిఆర్‌డిఎ పాజెక్టు డైరెక్టర్ నరసయ్య, డీపీఎంలు రామ్మోహన్, రామిరెడ్డి జిల్లా సమైక్య అధ్యక్షురాలు సిద్ధ గంగమ్మ, ఏటీఎం వెంకటప్ప, పలు స్వయం సహాయక బృందాల ప్రతినిధులు మహిళా సభ్యులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలందరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రేవలం మహిళలు తమ ఆదాయం కోసం మాత్రమే కాకుండా శాశ్వత జీవనోపాధి పద్ధతులను ఎంచుకొని వారి జీవన ప్రమాణాన్ని ఆర్థికంగా మెరుగుపరచుకోవడం కోసం ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పుట్టపర్తి మరియు లేపాక్షి మండల స్వయం సహాయక సంఘాలకు ఒక్కొక్క మండలానికి రూ. 10 లక్షల చొప్పున మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందజేస్తున్న చేస్తున్న కలెక్టర్, తదితరులు

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం

జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విద్యార్థులకు మెనూ ప్రకారం చక్కటి పౌష్టికాహారం అందించడమే తమ శాఖ లక్ష్యమని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి తెలిపారు. పేద విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం వారికి విద్యతోపాటు పుస్తకాలు, పౌష్టికాహారం అందిస్తోంది. ఎస్సి, ఎస్‌టి, బిసి విద్యార్థులు ఎందరో ప్రభుత్వ సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. అయితే సంక్షేమ హాస్టళ్లలో పలుచోట్ల అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించకపోవడం, అవసరమైన కాస్మాటిక్స్ సమకూర్చకపోవడం, పలు హాస్టళ్లకు ప్రహరీలు లేకపోవడం, కొన్నిచోట్ల టాయిలెట్స్ బాత్రూంలు సరిగా లేకపోవడం, కొన్నిచోట్ల ఫ్యాన్లు లేకపోవడం లాంటి సమస్యలు నెలకొని ఉన్నాయి. హాస్టళ్ల నిర్వహణ ప్రధానంగా వార్డెన్లు, వంట మనుషులపై ఆధారపడి ఉంటాయి. వేలాదిమంది పేద విద్యార్థులు హాస్టళ్లపై ఆధారపడి విద్యను అభ్యసిస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా బీసీ సంక్షేమ వసతి కేంద్రాల శాఖ అధికారి నిర్మల జ్యోతి ప్రజాశక్తి కి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూ లో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి? విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.?

జవాబు : జిల్లా వ్యాప్తంగా 57 బిసి సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో 41 హాస్టళ్లకు సొంత భవనాలుండగా , మరో 16 హాస్టళ్లు అద్దె భవనాలలోను దాతల సహకారంతో ఏర్పాటుచేసిన భవనాల్లోనూ కొనసాగుతున్నాయి. సొంత భవన



నిర్మాణాలకు ఉన్నత అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించాము. నిధులు మంజూరును బట్టి భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 5502 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్ర : మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు తెలపండి.?

జ : వారానికి ఐదు సార్లు కోడిగుడ్లు అందిస్తున్నాము. చికెన్ 2 సార్లు అందిస్తాము. ఆదివారం చికెన్ బిర్యాని అందిస్తాం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ఇవ్వడం జరుగుతుంది. ఎప్పటికప్పుడు శు భ్రంగా వేడిగా భోజన పదార్థాలు అందిస్తున్నాం.

ప్ర : జిల్లాలో ఎంతమంది వార్డెన్లు ఉన్నారు? వంట మనుషులు సరిపడా ఉన్నారా.?

జ : ప్రస్తుతమైతే 24 మంది వార్డెన్లు ఉన్నారు. జిల్లాలో ఇటీవల కొంతమంది వార్డెన్లు పదవీవిరమణ చేశారు. ఆ పోస్టులను భర్తీ చేయడానికి 25 మంది వార్డెన్లు అవసరం ఉంది. కొత్తవారిని ప్రభుత్వం నియమించవలసి ఉంది. ఉన్న వారితోనే నడుపుతున్నాము. వంట మనుషులు ఆరుగురు అవసరమవుతారు. త్వరలోనే వారిని నియమించుకునేందుకు చర్యలు తీసుకొంటాం.

ప్ర: పలు వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి? ఏం చర్యలు తీసుకొంటున్నారు.?

జ : వసతి గృహాలకు బాత్ రూములు, టాయిలెట్స్, ప్రహరీ నిర్మాణం, విద్యుత్ సరఫరా తదితర మరమ్మతుల పనులు ఉన్నాయి. వీటి కోసం ప్రభుత్వం రూ.1200 లక్షలు మంజూరు చేసింది. అవసరమైన హాస్టళ్ల లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు వినియోగించి పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

ప్ర : విద్యార్థులకు కాస్మొటిక్స్ అందిస్తున్నారా? అన్ని హాస్టళ్లలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తున్నారా.?

జ : ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు సబ్బులు, షాంపూ తదితర కాస్మొటిక్స్ అందిస్తున్నాము. అన్ని హాస్టళ్లలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. ఈ విషయమై తరచూ తాము హాస్టళ్లను పర్యవేక్షణ చేస్తున్నాం. మెనూ ప్రకారం ఆహారం అందించకుంటే సిబ్బందిపై తగు చర్యలు తీసుకొంటాం.

ప్ర: జిల్లా కేంద్రంలో మీ కార్యాలయానికి సొంత భవనం ఉందా? సిబ్బంది కొరత ఉందా?

జ: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో తమ కార్యాలయానికి సొంత భవనం లేదు. నూతనంగా జిల్లా ఏర్పడి రెండేళ్లు అవుతోంది. ప్రభుత్వం స్థల సేకరణ చేసింది. మరి ఎప్పుడు నిర్మిస్తారనేది ప్రభుత్వంపై ఆధారపడి ఉంది. ప్రస్తుతమైతే సత్యసాయి దీన జనోద్ధారణ భవన సముదాయాలలో కార్యాలయం నడుస్తోంది. సిబ్బంది 8 మంది ఉన్నారు. వారితోనే సర్దుకు పోతున్నాము.


జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి

ప్ర: విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలు ఏమిటి.?

జ: ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఏటా కోట్లరూపాయలు ఖర్చు చేస్తోంది. హాస్టళ్ల లో ఉంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచిస్తున్నాం. విద్యార్థుల తల్లితండ్రులు కూడా తమ పిల్లలు సెలవు రోజుల్లో ఇంటికి వచ్చినప్పుడు వారి ప్రవర్తనలు గమనించాలి. ఎలా చదువుతున్నారో అని అడిగి తెలుసుకుంటూ కుటుంబ పరిస్థితులు వివరిస్తూ బాగా చదువుకోవాలని ప్రోత్సహించాలి. అధికారులు హాస్టళ్ల తనిఖీకి వచ్చినప్పుడు విద్యార్థులు తమ ఇబ్బందులు తెలపాలని కోరుతున్నాం.

ప్రజాశక్తి www.prajasakti.com

పక్కాగా ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పునఃపరిశీలన

బత్తలపల్లి : ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పునఃపరిశీలన ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగా నిర్వహించాలని ధర్మవరం ఆర్‌డిఒ వెంకట శివరామిరెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నటరాజ్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. వారు ఆదివారం మండలంలోని బత్తలపల్లి, అప్పరాచెరువు, సంగాల, దంపెట్ల రెవెన్యూ గ్రామాల్లో విఆర్‌ఒలతో కలిసి రిజిస్ట్రేషన్ చేసిన ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించారు. అలాగే భూములకు సంబంధించిన రైతులను, కొనుగోలుదారులతో వివరాలు సేకరించారు. వారు మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయని, అందులో భాగంగానే పునఃపరిశీలన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. బత్తలపల్లి మండలంలోని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది, విఆర్‌ఒలు, విఆర్‌ఏలు, రైతులు ఉన్నారు.



కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథ్ రెడ్డి

టిడిపి కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేత

పుట్టపర్తి అర్బన్ : నిస్వార్థంగా పని చేసే కార్యకర్తలు ఉన్నంతకాలం టిడిపికి తిరుగేలేదని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. టిడిపి యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి క్రియాశీలకంగా పని చేస్తున్న కార్యకర్తలను గుర్తించి అధిష్టానం ప్రశంసా పత్రాలు మంజూరు చేసింది. వాటిని ఆదివారం ఎమ్మెల్యే మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజమైన కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలు అన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రశంసా పత్రం అందుకున్న వారిలో శివప్రసాద్‌రెడ్డి, మనోహర్‌మాల, సాయిప్రసాద్‌బాబు, ఇర్షాద్, ఆంజనేయులునాయుడు, కోనంకి శేఖర్‌నాయుడు, జనార్దన్‌నాయుడు, డాక్టర్ కృష్ణమూర్తి, పవన్ నాయక్, తదితరులు ఉన్నారు.

నల్లమాడ : టిడిపికి సేవలు అందించిన ఉత్తమ కార్యకర్తలకు నల్లమాడలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. పల్లె మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో యర్రవంకపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రవంకపల్లి తండా పవన్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

పుట్టపర్తి క్రైమ్ : శ్రీ కృష్ణ జన్మాష్టమి ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ భాగ్యరేఖ ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం యథావిధిగా ఉంటుందన్నారు.

టూ టౌన్ సిఐని కలిసిన టిడిపి నేత ఆది

ధర్మవరం టౌన్ : ఇటీవల బాధ్యతలు చేపట్టిన టూ టౌన్ సిఐ రెడ్డప్పను ఆదివారం స్థానిక టిడిపి జిల్లా నాయకులు కొత్తపేట ఆది పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆది సిఐకి పూలబొకే అందజేసి శాలువా కప్పి అభినందించారు.



సిఐ రెడ్డప్పకు పూలబొకే అందజేసిన ఆది

మంత్రి దృష్టికి చేనేతల సమస్యలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని చేనేత కార్మికులు పవర్ లూమ్స్ వల్ల తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరుతూ ఆదివారం చేనేత నాయకులు చింతా శ్రీనివాసులు, గంగాధర్ పెనుకొండలో చేనేత జౌళి శాఖల మంత్రి సవితనును ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. అలాగే చేనేతల సమస్యలను వివరించారు. బోగస్ సహకార సంఘాల అవినీతి, అక్రమాలను తెలపడంతో పాటు సిబిసిఐడి చేత విచారణ జరిపించాలని కోరారు. ప్రతి చేనేత కార్మికునికి 3 సెంట్ల స్థలంతో పాటు ఇల్లు, వర్క్ షెడ్ ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని వారు మంత్రిని కోరారు.



మంత్రి సవితకు చేనేతల సమస్యలు వివరిస్తున్న ధర్మవరం నేతన్నలు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ధర్మవరం రూరల్ : ఇటీవల నిర్వహించిన గ్రామసభలో మండలంలోని సీతారాంపల్లి గ్రామ ప్రజలు తాగునీటి సమస్యపై వినతి ఇచ్చారు. దానిపై స్పందించిన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అధికారులతో మాట్లాడి ఆదివారం బోరు వేయించారు. దీంతో పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కులం సర్టిఫికెట్ కోసం మంత్రికి వినతి

రొద్దం : పిరామలైకల్లర్ కులం సర్టిపికెట్ ఇప్పించాలని కోరుతూ ఆదివారం ఆ సామాజిక వర్గం ప్రజలు బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. మంత్రి ఆదివారం మండలంలోని ఎంజెపి పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో పిరామలై కల్లర్ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి మొట్టయ్యండి తేవర్ మంత్రిని కలిసి ఈ కులస్తులు 30 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నారు. అయితే కుల సర్టిఫికెట్ లేకపోవడంతో ఎలాంటి సంక్షేమ పథకాలు, లబ్ధి అందడం లేదన్నారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

రహదారిలో గుంతలు పూడ్చివేత

పరిగి : ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారి నుంచి పరిగి వరకూ రహదారి గుంతల మయం కావడం, అందులో నీరు నిలుస్తుండడంతో వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఈ సమస్యను స్థానిక అధికారులు, నాయకులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. మంత్రి ఆదేశాలకు ఇరిగేషన్ డిఈ లక్ష్మీనారాయణకు తాత్కాలికంగా మట్టిని తరలించి గుంతలను పూడ్చాలని తెలిపారు. దీంతో స్థానిక నాయకులు ట్రాక్టర్లు, జెసిబిలతో రోడ్డులోని గుంతల్లో మట్టి వేసి పూడ్చి వేశారు.



మట్టితో రోడ్డులో గుంతలు పూడుస్తున్న నాయకులు

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-బత్తలపల్లి

రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. బత్తలపల్లి, లింగారెడ్డి పల్లి క్రాస్, ఈదుల ముష్టూరు క్రాస్ వద్ద ఆదివారం ఎస్ఐ వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అతివేగం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనం ఇవ్వవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనం నడపాలన్నారు. ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

'జింకా రామాంజి పవర్‌లూమ్స్'లో అక్రమాలు నిగ్గు తేల్చాలి : సిపిఎం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 'జింకా రామాంజి పవర్‌లూమ్స్'లో జరుగుతున్న అక్రమాలను నిగ్గు తేల్చాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, శేషంపల్లి మారుతి, ఆయూబ్‌ఖాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకున్న పలుకుబడితో వందకోట్ల చేనేత ప్రాజెక్టును దక్కించుకుని నిబంధనలు పాటించకుండా కార్మికుల పొట్టకొడుతున్న జింకా రామాంజనేయులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారమే పవర్ లూమ్స్ నిర్వహిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రజాసంఘాలుగా మేము వస్తాం.. ఫ్యాక్టరీలో నెల రోజులుగా సీసీ పుటేజీ బయటకు తీస్తే ఎలాంటి చీరలు తయారుచేస్తున్నారు.. ఫ్యాక్టరీలో స్థానికులు న్నారా.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారా అనే విషయం తెలుస్తుంద న్నారు. కొందరి స్వార్థం వల్ల చేనేత పరిశ్రమ పూర్తిగా కనుమరుగైందని, కనీసం పవర్‌లూమ్స్ వల్ల చిన్న చిన్న కార్మికులు ఉపాధి పొందుతారనుకుంటే వాటి స్థానంలో అత్యంత ఆధునిక టెక్నాలజీతో కూడిన జెట్ లూమ్స్ లాంటివి ఏర్పాటు చేసి కార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు. తనకు ఎలాంటి సబ్సిడీలు రాలేదంటున్న సదరు యజమాని అందుకు సంబంధించిన జీవోలు చూపాలని, ఎంత మంది స్థానికులకు ఉపాధి కల్పించారో కూడా చెప్పాలని కోరారు. మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను కచ్చితంగా అమలుచేసి చేనేత పరిశ్రమను గాడిన పెట్టకపోతే కార్మికులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా అందులో చేనేత శాఖ మంత్రి అయిన సవిత మౌనంగా ఉండడం విచారకరమన్నారు. జింకా రామాంజనేయులు అక్రమాల పై జిల్లా కలెక్టర్, ధర్మవరం ఆర్‌డిఒలను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే త్వరలోనే ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేసి అక్రమాలను వెలికితీయడానికి ప్రజా సంఘాలుగా తాము ముందుంటామని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

'చేతన' సేవలు భేష్ : మంత్రి

కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు, ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

సామాజిక సేవలో చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంద మందికి కుట్టుమిషన్లు, ట్రై సైకిళ్లు, తోపుడుబండ్లను సమకూర్చగా వాటిని ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో మంత్రి సవిత పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ చేతన ఫౌండేషన్ ఛైర్మన్ రవికుమార్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఫౌండేషన్ చేయూతను వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా వృద్ధి సాధించాలన్నారు. మహిళల ఆదాయం పెరిగేందుకు జిగ్ జాగ్ మిషన్లు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వైసిపి హయాంలో జగన్ అసమర్థత వల్ల అన్ని రంగాలతో పాటు విద్యావ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతోందన్నారు. నియోజకవర్గం లో రెండు బిసి హాస్టళ్లను 'చేతన' రవికుమార్ దతత్త తీసుకోవాలని మంత్రి కోరారు. చేతన ఫౌండేషన్ ఛైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో 20 ఏళ్ల నుంచి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రి సవిత దంపతులను చేతన ఫౌండేషన్ నిర్వాహకులు సత్కరించగా, ఫౌండేషన్ ఛైర్మన్ రవికుమార్, జాయింట్ సెక్రటరీ సీతారామయ్య, ఇతర సభ్యులను మంత్రి సన్మానించారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు నారాయణస్వామి, వెంకటరాముడు, వెంకటరమణ, శ్రీనివాసులు, మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణ, బాబుల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, త్రివేంద్ర, దాదు, చేతన ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి సవిత

ఎమ్మెల్యే రాజు సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-మడకశిర

ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఎమ్మెల్యే ఆదివారం ఉదయం 6 గంటలకే పట్టణంలోని చౌటుపల్లి, ఎస్సీ, బీసీ కాలనీలు, చాకలికుంట, మారుతినగర్‌లో సుడిగాలి పర్యటన చేపట్టారు. స్థానికులు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, తాగునీరు, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కాలనీలో ప్రతి విద్యుత్ స్తంభానికి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ఖాళీ స్థలాల్లో పెరిగిన ముళ్లపొదలను యజమానులు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వార్డులో సీసీ రోడ్ల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, తాత్కాలికంగా మట్టి వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కౌన్సిలర్‌కు తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిడిపి పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ కాలనీవాసులు ఉన్నారు.

డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

పట్టణంలోని డిగ్రీ కళాశాలలో సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సందర్శించారు. శిక్షణ తరగతులు ఎలా సాగుతున్నాయని అభ్యర్థుల ను అడిగి తెలుసుకున్నారు. బాగా సన్నద్ధమై ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని సూచించారు.



రిబ్బన కట్ చేసి ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

కోడిపల్లి పంచాయతీకి ట్రాక్టర్ అందజేత

3 వేలకు పైగా జనాభా ఉన్న అగళి మండలంలోని కోడిపల్లి గ్రామ పంచాయతీకి చెత్త సంపద నిర్వహణ కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్ మంజూరు చేసింది. ఆ ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి శివనారాయణరెడ్డితో కలిసి కోడిపల్లి సర్పంచి నరసింహమూర్తికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రోగాలు బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చెత్తసంపద నిర్వహణ కోసం ట్రాక్టర్లు మంజూరు చేసిందన్నారు.

వేమన పద్యాలు సామాజిక చైతన్య దీపికలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పండితులు, పామరులకు సైతం అర్థమయ్యే సులభ శైలిలో ప్రజాకవి వేమన రాసిన పద్యాలు సామాజిక చైతన్య దీపికలు అని కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డికె.చదువుల బాబు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన 50 మంది ప్రముఖ కవులు, రచయితలు ఆదివారం పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుంచి కటారుపల్లిలోని వేమన సమాధి, తిమ్మమ్మ మర్రిమాను వరకూ వేమన సాహితీ(బస్సు) యాత్ర నిర్వహించారు. అనంతరం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన వేమన సాహితీ వేదికకు సభకు చిన్నారావు అధ్యక్షత వహించారు. ముందుగా వేమన విగ్రహానికి సాహితీవేత్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చదువుల బాబు మాట్లాడుతూ నేటి తరానికి వేమన పద్యాలపై ప్రత్యేక సదస్సుల ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాబిలి, జయచంద్ర మాట్లాడుతూ వేమన సాహితీయాత్ర ద్వారా వేమన భావజాలాన్ని దశదిశలా వ్యాప్తి చేస్తామన్నారు. అలాగే విశిష్ట అతిథి పచ్చిపులుసు సూర్యనారాయణ, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, ఉమర్ ఫరూక్ ఖాన్, చింతా నాగరాజు, పద్య కవి రామబ్రహ్మం, కోగిర జయచంద్రారెడ్డి, ఉపేంద్రం శంకరనారాయణ రాజు, వేమన వంశీకులు చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మమ్మ మర్రిమాను ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణస్వామి, సర్పంచి విష్ణుమూర్తి ప్రసంగించారు. అనంతరం తిమ్మమ్మ మర్రిమాను ఆలయం ప్రాంగణంలో 'ప్రజాకవి వేమన' అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం కవులు లీలా మనోహర్, మధుం శ్రీ, సత్య నిర్ధారణ్, బుద్ధ రంగప్ప, ఈశ్వర్‌గుప్తా, మహమ్మద్ ముస్తఫా, రాజశేఖర్‌రెడ్డి, గాయత్రీదేవి, స్రవంతి, హసీనా బేగం, శంకర్‌రాజు, పచ్చిపులుసు సూర్యనారాయణ, సుందర మోహన్ రెడ్డి, భోగినేని మునీంద్ర, హలీమా, బాబా ఫక్రుద్దీన్, కుంచె శ్రీ, నాగజ్యోతి, ఆర్కే గుప్తా తదితరులను జ్ఞాపిక, శాలువా, వేమన సాహితీ పురస్కారంతో ఘనంగా సత్కరించారు.



వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కవులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గాండ్లపెంట : వర్షాకాలంలో సైతం తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని మండలంలోని జీన్లకుంట పంచాయతీలోని దళితవాడ, జీన్లకుంట, తదితర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 160 కుటుంబాలు ఉన్నాయని, బోరు చెడిపోయి రెండు నెలల నుంచి తాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొందరు స్వార్థపరులు తాగునీటి పైపులైన్లను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. తాగునీటి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం లేదన్నారు. ఇటీవల నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. విధి లేని పరిస్థితుల్లో 3 కిలోమీటర్ల దూరం వెళ్లి వ్యవసాయ బోరుబావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. అంతదూరం వెళ్లలేని వారు వాటర్ ప్లాంట్ వద్ద బిందెకు రూ. 15 చెల్లించి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బోరు మరమ్మతులు, పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతుఉన్నారు.

పట్టుదల, కృషితో ఏదైనా సాధ్యం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టుదల, కృషి, దృఢ సంకల్పంతో ముందడుగు వేస్తే ఏదైనా సాధించవచ్చని అధ్యాపకులు నారాయణ, శ్రీధర్, వెంకటరమేష్, విశ్వనాత్ తెలిపారు. కందికుంట నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రధాన అంశాలపై తరగతులను బోధించడానికి ఆదివారం ప్రత్యేకంగా అధ్యాపకు లను ఆహ్వానించారు. వారు టెట్, డీఎస్సీ పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో అభ్యర్థులకు వివరించారు. డీఎస్సీ అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఉచిత శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏ స్థాయికి వెళ్లినా చదువుతో పాటు సంస్కారం కూడా పెంచుకోవాలన్నారు. శిక్షణ తరగతులకు 200 మంది హాజరవుతున్నారు. కార్యక్రమంలో ఓడిసి ఎంఇఒ రమణ, నారాయణ, వెంకటరమేష్, శ్రీధర్‌బాబు, విశ్వనాథ్ హాజరయ్యారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సాధన ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం హెచ్‌ఎం సీతాపతిరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. సీతాపతిరావు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమికి పటిష్ట బందోబస్తు : డీఎస్పీ

పుట్టపర్తి రూరల్ : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రశాంతి నిలయంలో నిర్వహించే వేడుకలకు పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే వైజాగ్ నుంచి 2,500 మంది భక్తులు వచ్చారని, స్థానిక భక్తులు, వివిధ రాష్ట్రాల భక్తులు వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా పట్టణంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, స్థానికులు సహకరించాలని డీఎస్పీ కోరారు.

నల్లచెరువు : స్థానిక గీతా మందిరంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవర ఇంటి భాస్కర్‌రెడ్డి, బూసుపల్లి నరసింహులు తెలిపారు. వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, వాల్మీకి స్కూల్ అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, కృష్ణమోహన్‌నాయుడు, కెవి.రమేష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదంచేయాలని వారు కోరారు.

బత్తలపల్లి : స్థానిక ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమ, మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. సోమవారం తాడిపత్రి రోడ్డులోని బిసి కాలనీలో ఉన్న పూజా మండపం వద్ద ప్రత్యేక పూజలు, భగవద్గీత పఠనం కార్యక్రమాలు ఉంటాయన్నారు. మంగళవారం శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహ ఊరేగింపు, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంఠాపురంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



సాధన పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

నేరాలు ఘోరాలు

బైక్ ఢీకొని టిడిపి నేత మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కదిరి గేట్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. స్థానికులు, వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ఉడుముల చిన్నవెంకటయ్య(75) చేనేత మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. ఉదయం ఇంట్లోని చెత్తను పారవేయడానికి రోడ్డుపైకి రాగా గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబసభ్యులు 108 వాహనంలో అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చిన్న వెంకటయ్య (ఫైల్‌ఫోటో)

గంజాయి స్వాధీనం.. విక్రేత అరెస్ట్

పుట్టపర్తి క్రైమ్ : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ సునీత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రమైన కొత్తచెరువుకు చెందిన మోకా విజయభాస్కర్ పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లికి వెళ్లే రహదారిలో ఓ పెట్రోల్ బంక్ సమీపంలో టీ కొట్టు దగ్గర గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. ధర్మవరం పట్టణానికి చెందిన ఎరికల పెద్దన్న వద్ద 830 గ్రాముల గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. సిఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. సిఐతో పాటు ఎఎస్ఐ గంగన్న, కానిస్టేబుళ్లు కొండారెడ్డి, రామంజి ఉన్నారు.

'పురం'లో ఘర్షణ... నలుగురికి గాయాలు

హిందూపురం : పట్టణంలోని రహమత్ పురం సర్కిల్‌లో ఆదివారం రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. రఫీక్ రహమత్ పురం సర్కిల్ లో చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం దుకాణం వద్దకు అల్లా బకాష్ వెళ్లి రెండు సిగరెట్ పాకెట్లు తీసుకున్నాడు. డబ్బులు అడిగినందుకు షాపులో ఉన్న కూల్ డ్రింక్ బాటిల్ తీసుకుని తనపై దాడి చేశాడని రఫీక్ ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న రఫీక్ సోదరుడు నిస్సార్ అక్కడికి చేరుకుని అల్లాబకాష్ పై దాడి చేయడానికి యత్నించాడు. దీంతో అల్లా బకాష్ తమ్ముడు హరూన్ సైతం అక్కడికి చేరుకుని వారిపై గొడవకు దిగాడు. ఆ గొడవలో నలుగురుకి రక్త గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రెండవ స్టేషన్ పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడ్డ వారిని జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అనంతరం రెండు గ్రూపుల వారు ప్రభుత్వ అసుపత్రి వద్ద ఒకరికొకరు వాదనకు దిగారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యభిచార గృహం నిర్వాహకులపై కేసు

కదిరి టౌన్ : వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు మరో ఇద్దరు విటులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కందికుంట నారాయణమ్మ కాలనీలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. కదిరి పట్టణానికి చెందిన కడియాల పుష్పలత, అల్లపాటి అంజినమ్మ, అరెస్టు చేశారు. వీరిపై గతంలో కూడా ఇదే తరహాలో పట్టుబడిన ట్లు తెలిపారు. వ్యభిచార గృహం నిర్వాహకులతో సంబంధం ఉన్న వారి ఫోన్ నెంబర్లు, బ్యాంక్ స్టేటమెంట్లు, ఇతర వివరాలు వారి నుంచి సేకరించి సంబంధం ఉన్న ఇతరులను గుర్తించి వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బత్తలపల్లి : అనుమతి లేకుండా మండలంలోని చిత్రావతి నది నుంచి ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆదివారం ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ సంజీవపురం వద్ద పట్టుకొని కేసు నమోదు చేయాలని ఎస్ఐ శ్రీనివాసులును ఆదేశించారు. సిఐ మాట్లాడుతూ తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లోని చిన్న చిగుళ్లరేవు, గరికలపల్లి వద్ద చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను ఎవరు తరలించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇసుక రీచ్ పాయింట్లు, స్టాక్ పాయింట్ల వద్ద మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలన్నారు. ఇసుక తీసుకెళ్లే సమయంలో వాహనాలను తనిఖీ చేసినప్పుడు రశీదులు చూపాల్సి ఉంటుందన్నారు. లేనిచో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పుట్టపర్తి అభివృద్ధికి కృషి

పుట్టపర్తి రూరల్ : శ్రీసత్యసాయిజిల్లా అభివృద్ధికి, ప్రత్యేకంగా అధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి అభివృద్ధికి కృషి చేస్తామని బిజెపి రాష్ట్ర నాయకులు అన్నారు. ఈ మేరకు ఆపార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం. శేఖర్ అధ్యక్షతన ఆదివారం జిల్లాకేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తమ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం నాయకులు పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు తదితర వాటి గురించి చర్చించారు. ఈ కారక్యక్రమంలో రాష్ట్ర నాయకులు మధుకర్, విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి బాలకృష్ణ యాదవ్, ఎంఎస్. పార్థసారథి, దేవానంద్, వంశీ, తలుపుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి టిడిపి నాయకుల చేయూత

ధర్మవరం టౌన్: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ ఎల్-4లో నివాసం ఉంటున్న వెంకటరాముడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 28వ వార్డు ఇన్‌ఛార్జి గస్తీ ఓంకార్, నాయకులు మాధవరెడ్డి, సుగుణమ్మ, యశోదమ్మ వెంకటరాముడు ఇంటికి వెళ్లి అతడి భార్య శ్యామలను పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. అలాగే వారి ఇల్లు తాకట్టులో ఉందని తెలియడంతో టిడిపి నాయకులు సొంత డబ్బు చెల్లించి వారి ఇంటి పత్రాలను విడిపించి శ్యామలమ్మ, కుమార్తెలు అలేఖ్య, అంజలిలకు అందజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ధర్మవరం టౌన్ : పట్టణంలో సేవా కార్యక్రమాల నిర్వహణకు దాతల సహకారం మరువ లేనిదని ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం గవ్వల లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం ఆయన అల్లుడు బండిబాబు కుటుంబసభ్యుల సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగేంద్ర 95 మందికి కంటి వైద్యపరీక్షలు చేసి 54 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, కార్యదర్శి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి నాగేంద్ర, గోసే రాధాక్రిష్ణ, సభ్యులు పల్లెం వేణుగోపాల్, ఉట్టి శివప్రసాద్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేంద్ర

మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

అమరాపురం : మహిళలను లక్షల అధిపతిని చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి ఈరన్న, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, శివరుద్రప్ప తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ మహిళా సంఘాల సభ్యులతో ఆదివారం నిర్వహించిన లైవ్ ప్రోగ్రాంను స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం తిప్పన్న ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ముఖ్య అతిథులు ఈరన్న, నరసింహమూర్తి, శివరుద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష లోపు ఆదాయం కలిగిన మహిళలకు జీవనోపాధుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించి ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రధాని ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు, వెలుగు యానిమేటర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.